


వికలాంగులకు నేషనల్ స్కాలర్ షిప్‌లు

పార్వతీపురంటౌన్ : వికలాంగ విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్‌కు అక్టోబరు 31లోగా దరఖాస్తులు అందజేయాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు వయోవృద్ధులు శాఖ ఎడి కె.కవిత మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారిత మత్రింత్వ శాఖ ఈ విద్యా సంవత్సరానికి నేషనల్ స్కాలర్ షిప్ లకు దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. ప్రి మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, ఉన్నత చదువులకు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో గల వికలాంగ విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్ www.scholarships.gov.in వెబ్ సైట్‌లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రి మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆగష్టు 31లోగా దరఖాస్తు చేయాలన్నారు. ఇంటర్ నుంచి పోస్టుగ్రాడ్యుయేషన్ చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అక్టోబరు 31 లోగా ధరఖాస్తు చేయాలని కోరారు.

మహిళలు వ్యాపార దిగ్గజాలు కావాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్వయం సహాయక సంఘాల్లో గల మహిళలు వ్యాపార దిగ్గజాలు కావాలని కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ అన్నారు. జిల్లా మహిళా సమాఖ్య 22వ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళలు వ్యాపారరీత్యా మరింత అభివృద్ధి సాధించడమే కాకుండా జిల్లాకు గుర్తింపును తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రతి వస్తువును మహిళా సంఘాలు మార్కెట్ చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. మహిళలు సివిల్ పనుల కాంట్రాక్టుల్లో సైతం ప్రవేశం చేయవచ్చని సూచించారు. స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంకులకు ధీటుగా వ్యవహారాలను నడిపిస్తున్నారని ఆయన కితాబు ఇచ్చారు. జిల్లాలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు మెరుగుపడాలని, ప్రతి ఒక్కరూ ఆర్థిక సుస్థిరత సాధించాలని పేర్కొన్నారు. మహిళలు సంఘాలుగా, వ్యక్తిగతంగా ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్, కోళ్ల పెంపకం, కూరగాయల పెంపకం, డ్రాగన్ ఫ్రూట్ పెంపకం వంటి వ్యవసాయ కార్యకలాపాలతో పాటు ఊదొత్తుల తయారీ, టైలరింగ్ బ్యూటీషియన్ వంటి వ్యవసాయేతర రంగాల్లోనూ రాణించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని తద్వారా మంచి లాభాలు సాధించవచ్చని సూచించారు. సభ్యులుగా లేని వారికి కూడా అవగాహన కల్పించి ఆర్థిక ఉన్నతికి పాటుపడాలని చెప్పారు.



మహిళా మార్టును పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సామాజిక బాధ్యత వహించాలి

సమాజంలో వివిధ రంగాల్లో సమష్టిగా కృషి చేయడం వల్ల సమాజంలోని అనర్థాలను పారదోలవచ్చని కలెక్టర్ అన్నారు. ఇందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులు సామాజిక బాధ్యతతో పనిచేసి సహకరించాలని సూచించారు. బాల్యవివాహాలు ఎక్కడ జరగకుండా చూడాలని కోరారు. జిల్లాలో రక్తహీనత కనిపిస్తుందని, దీన్ని పారదోలాల్సిన అవసరం ఉందని చెప్పారు. గ్రామంలో గర్భిణులను ఆగ్రామ స్వయంసహాయ మహిళలు దత్తత తీసుకోవాలని, తద్వారా ఆమెను నిరంతరం పర్యవేక్షణ చేసి రక్తహీనత లేకుండా చేయడం మాత్రమే కాకుండా పౌష్టికాహారం, ఆరోగ్యం వంటి అంశాలను పరిశీలించవచ్చని చెప్పారు. ప్రతి మహిళ ఆసుపత్రిలో మాత్రమే ప్రసవం కావడానికి దోహదం చేయాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, పిల్లల్ని చదివించాలని సూచించారు. డిఆర్‌డిఎ పీడీ వై.సత్యంనాయుడు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు దాదాపు శతశాతం తిరిగి చెల్లింపులను చేస్తున్నారన్నారు. జిల్లాలో మహిళా మార్టలను నిర్వహిస్తున్నామని, ఆరు నెలల్లోనే రూ.79 లక్షల విలువగల మార్కెటింగ్ చేశామని వివరించారు. వన్ ధన్ వికాస్ కేంద్రాల ద్వారా కొండచిపుర్లు, పసుపు, చింతపండు, అగర్బత్తి తదితర ఉత్పత్తులను చేస్తూ ఆదాయార్జనగా సంఘాలు నడుస్తున్నాయన్నారు. అనంతరం జిల్లా మహిళా సమాఖ్య ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టరు పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఓ ప్రభాకర్ రావు, జిసిసి డిఎం వి.మహేంద్ర కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్ మూర్తి, నాబార్డ్ డిడిఒ డిఎస్ దినేష్ కుమార్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులు పి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులు ఆరిక శాంతి కుమారి, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథరావు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర ప్రాంత అభివృద్ధికి కృషి

- రామభద్రపురం మండలాన్ని ఐటిడిఎలో చేర్చేందుకు కేంద్రానికి లేఖ రాస్తా
- చిన్నారి కుటుంబానికి ఎంపి కలిశెట్టి పరామర్శ
- ఏడొంపుల గెడ్డ, గ్రీన్‌ఫీల్డు రహదారి పరిశీలన

ప్రజాశక్తి-రామభద్రపురం

గిరి శిఖర ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. రామభద్రపురం మండలాన్ని ఐటిడిఎలో కలిపేందుకు కేంద్రానికి లేఖరాస్తానని చెప్పారు. జీలుగువలసలో లైంగిక దాడికి గురైన చిన్నారిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం పరామర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి బాలిక పరిస్థితిని తెలుసుకున్నారు. ఎంపి కొండ కెంగువ వరకు కారులో వచ్చి అక్కడి నుంచి కొంతదూరం ద్విచక్ర వాహనంపై పయనించి ఆ తరువాత రహదారి అనుకూలంగా లేకపోవడంతో సుమారు 2 కిలోమీటర్ల కాలి నడకన సెలయేర్లు దాటుకుంటూ గిరి శిఖర గ్రామం జీలుగు వలస చేరుకున్నారు. చిన్నారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే గ్రామంలో పూరి పాకలో నడుపుతున్న మినీ ఆంగన్ వాడీ సెంటర్లో ఆయా బుచ్చమ్మతో మాట్లాడి చిన్నారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ రహదారులు అధ్వానంగా ఉన్నాయని కనీస సౌకర్యాలు కరువవ్వడంతో ఇబ్బందులు పడుతున్నామని సమస్యలు ఏకరువు పెట్టారు. ఈ గ్రామం నుంచి 3 కిలోమీటర్ల ఆవల ఉన్న పాఠశాలకు నడక దారిలో హైవే దాటి విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందని తెలపడంతో స్వయంగా ఆ మార్గంలో నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. చిన్నారులు ఈ మార్గం మీదుగా వెళ్ళడం అసాధ్యమని, విద్యార్థులను ఇదే పంచా యతీ పాఠశాలలో చేర్పించేలా ఎంఇఒ చర్యలు తీసుకోవాలని సూచించారు. మిని అంగన్వాడీ కేంద్రానికి పక్కా భవనం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఉపాధి హామీ నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆరు లైన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణాలు పరిశీలించారు. ఆ సంస్థ అధికారి రవితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొండ కెంగువలో ఉన్న ఏడొంపుల గెడ్డ ఆనకట్టను పరిశీలించి సాగునీరు అందే గ్రామాల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిన్నారిపై జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత బాలిక కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తామన్నారు. పసికందు ఆరోగ్య పరిస్థితిని నిరంతరం అంగన్వాడీ కార్యకర్త పర్యవేక్షణ చేయాలని కోరినట్లు చెప్పారు. ఆడపిల్లలపై అకత్యాలు జరగకుండా అంగన్వాడీలు,మహిళా ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనా రాణి, ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కర్, స్థానిక సర్పంచ్ కంచుపల్లి సుజాత, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జీలుగువలసలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు



గంద్రగెడ్డ చెక్‌డామ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలోని చిన్న తరహా సాగునీటి వనరుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ఖరీఫ్‌కు సాగునీరందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లోవముతా ప్రాంతమైన దుడ్డుఖల్లులో గల గంద్రగెడ్డ చెక్ డ్యామ్‌ను ఎమ్మెల్యే మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గెడ్డ రూపురేఖలు, ప్రస్తుత పరిస్థితిని సంబంధిత అధికారులకు అడిగి తెలుసుకున్నారు. పాడైన చోట మరమ్మతులు చేపట్టి గిరిజన రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టిడిపి హయాంలో నిర్మించిన చెక్ డ్యాములు, మినీ రిజర్వాయర్లను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో పంట పొలాలకు సాగునీరందక కరువు ఏర్పడిందన్నారు. మళ్లీ టిడిపి అధికారంలోకి రావడంతో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతు సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శనరావు, నాయకులు తాడంగి లక్ష్మణరావు, జమ్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు స్థలాలివ్వాలి

జిఎంపిఎస్ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గంటా శ్రీరాం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందారులకు ఐదు ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని జిఎంపిఎస్ సంఘాల సమాఖ్య అధ్యక్షులు గంటా శ్రీరాం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నియోజకవర్గ పరిధిలో గల గొర్రెలు, మేకల పెంపకందారుల సదస్సు జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు రండి అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీరాం మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. ప్రజలకు పోషకాహారాన్ని అందిస్తున్న పెంపకం దారుల పట్ల వివక్ష చూపడం అన్యాయమన్నారు. గొర్రెలు, మేకల మేత కోసం ఐదు ఎకరాల భూమి కేటాయించాలనే నిబంధనలున్నా ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. గ్రామాల్లో బంజరు, ప్రభుత్వ పోరంబోకు భూములు, చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయని, దీని వల్ల గొర్రెలు, మేకల మేత కోసం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అటవీ శాఖ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని చెప్పారు. జీవో 559, 1016 ప్రకారం వృత్తిదారులకు ఐదెకరాల భూమి కేటాయించాలని చెప్పారు. గొర్రెలు, మేకలకు ఏటా నాలుగు సార్లు డీ వార్మింగ్, నట్టల నివారణ మందులు ప్రభుత్వం సరఫరా చేయాలని అన్నారు. అలా పంపిణీ చేయకపోవడం వల్ల గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నాయని చెప్పారు. ఎన్‌సిడిసి ద్వారా గొర్రెలు, మేకల పెంపకందారులకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.88 కోట్లు విడుదల చేయాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకం దారులకు 90 శాతం సబ్సిడీతో షెడ్లు నిర్మాణం చేపట్టాలని డిమాండ్. కార్యక్రమంలో పలువురు పెంపకందారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సమాఖ్య అధ్యక్షులు శ్రీరాం

గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం నూతన కార్యవర్గం

సదస్సు అనంతరం మన్యం జిల్లా గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా రండి అచ్యుతరావు, ఉపాధ్యక్షులుగా అల్లు రామకృష్ణ, కార్యదర్శిగా కసినబోయిన తిరుపతి, సహాయకార్యదర్శిగా టి.వెంకటరమణ, కోశాధికారిగా బూర అచ్చిప్పితో పాటు 20మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను వృత్తి దారుల సంఘం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, అభినందించారు.

ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకర్రావు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఉపాధ్యాయుల్ని రాష్ట్రాల వారీగా నియమించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు లేఖరాశారు. రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఎన్ఇఎస్‌టి సంస్థ ద్వారా దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉపాధ్యాయులను నియమించడం ద్వారా వారు ఇక్కడ పనిచేసేందుకు వచ్చారని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో నియమించిన హిందీ ఉపాధ్యాయులు హిందీ భాషలో పాఠాలు చెప్పడం వలన పిల్లలకు అర్థం కాక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకురాడంతో చైర్మన్ స్పందిస్తూ . కేంద్రీకృత పద్ధతిలో కాకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలో గల ఉపాధ్యాయులను నియమించాలని సిఫార్సు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు.

18న గెస్ట్ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూ

నెల్లిమర్ల: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో సాంఘిక సంక్షేమ శాఖ విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో గెస్ట్ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి తెలిపారు. ఇంగ్లీష్, గణితం, జంతుశాస్త్రం, హిందీ, ఎకనామిక్స్, స్టాఫ్‌నర్స్ పోస్టులకు అర్హత కలిగిన పురుష అభ్యర్థులు, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, ఫిజిక్స్, ఫిజికల్ డెరైక్టర్, స్టాఫ్ నర్స్ ఖాళీ పోస్టులకు ఈ నెల 18న స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కలశాల లో డెమో వాక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సమన్వయ కర్త కార్యాలయం, ఆయా బి ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలల్లో నోటీసు బోర్డులో ఉన్నాయని తెలిపారు.

ఖాళీల వివరాలు

పాలకొండ, సాలూరు బాలుర పాఠశాలల్లో ఒక్కో జెఎల్, భామిని బాలికల పాఠశాలలో టిజిటి 2 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.

సమీకృత రిజిస్టరు అమలు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గర్భిణులకు అందిస్తున్న సేవలు, వారి ఆరోగ్యం నిరంతర పర్యవేక్షణకు సమీకృత రిజిస్టరు అన్ని పిహెచ్‌సిల్లో అమలు చేయాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గర్భిణులకు ఆర్ఎంపి వెద్యులు సేవలందించకూడదని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టరు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, కమ్యూనిటీ హెల్త్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన వెద్యసేవలు, నిరంతర పర్యవేక్షణ అందించడం ద్వారా మాతృత్వ మరణాలు నివారించవచ్చునని, అందుకుగాను కొత్తగా రూపొందించిన సమీకృత రిజిస్టరు జిల్లాలో గల అన్ని పిహెచ్‌సిల పరిధిలో అమలు చేయాలని, ఇందుకు ప్రణాళిక ప్రకారం సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. పిహెచ్‌సిల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో ఎఎన్ఎం గానీ, ఆశ వర్కరుగాని, కమ్యూనిటీ హెల్త్ వర్కరుగాని ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిరిశిఖర గ్రామాల్లో గర్భిణులను ముందుగానే వసతి గృహాలకు తరలించాలన్నారు. రక్తహీనతను సమర్థవంతంగా నివారించేందుకు గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు రోజువారీ మోతాదులో తీసుకునేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. హైరిస్కు కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో అవసరమైన చోట్ల అల్ట్రా సౌండ్ స్కానింగు ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టరు తెలిపారు. బాల్యవివాహాలు, చిన్న వయస్సులో గర్భధారణ నివారించేందుకు చట్టపరమైన చర్యలతో పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బాలికల వ్యక్తిగత పరిశుభ్రతకు శానిటరీ నాప్‌కిన్స్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎంపిలందించే వైద్యసేవలపై పర్యవేక్షించాలని, తప్పుడు వైద్యం చేసి ప్రాణాపాయం కలిగిస్తే బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం మోనటరింగ్ యూనిట్ ఇన్‌ఛార్జి డాక్టర్ కెవి హర్ష గర్భిణులకు అందిస్తున్న సేవలు, వారి ఆరోగ్యం నిరంతర పర్యవేక్షణకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న పలు రిజిస్టర్ల స్థానంలో కొత్తగా రూపొందించిన సమీకృత రిజిస్టరు పనితీరును కలెక్టరుకు వివరించారు. కొమరాడ, కె.ఎల్.పురం, తాడికొండ పిహెచ్‌సిల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన వివరాలు తెలిపారు. అనంతరం చక్కని పనితీరుకనబర్చిన కమ్యూనిటీ హెల్త్ అధికారులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, డిఎంఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, డిఐఒ డా.నారాయణరావు, కమ్యూనిటీ హెల్త్ అధికారులు హాజరయ్యారు.



కమ్యూనిటీ హెల్త్ అధికారికి బహుమతిని అందజేస్తున్న కలెక్టర్, ఐటిడిఎ పిఒ

ఆ రోడ్డులో ప్రయాణం గండమే

ప్రజాశక్తి కొమరాడ

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కొమరాడ మండలంలో అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణం క్షణక్షణం గండమేనని వాహనదారులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటిపాం నుంచి కూనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. దీంతో మంగళవారం వేకువజామున గుమ్మడ గ్రామం వద్ద ఏర్పడిన భారీ గోతిలో కర్రల లారీ రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయింది. దీంతో సుమారు నాలుగు గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒడిశా నుంచి వచ్చిన వాహనాలు ఆంధ్రా నుంచి ఒడిశాలోకి వెళ్తున్న వాహనాలు ఎక్కడికక్కడ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు, కుటుంబ సభ్యులతో రహదారిపై తీవ్ర అవస్థలు పడ్డారు. స్థానిక లారీ డ్రైవర్లు అంతా లారీని గోతులో నుంచి బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. కూనేరు వరకు వెళ్లే బస్సులు సైతం గుమ్మడ వద్ద నిలిపివేయడంతో కూనేరు వెళ్లే ప్రయాణకులు మరిన్ని ఇబ్బందులు పడ్డారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి వచ్చిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే ఈ రోడ్డు మరమ్మతులు చేసిన ప్రమాదాల నుంచి తప్పించాలని కోరుతున్నారు.

సిపిఎం నిరసన

పెద్దపెద్ద గోతుల్లో నిత్యం లారీలు ఉండిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. గుమడ సమీపాన గోతిలో దిగిపోయిన లారీ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లతో కలిసి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మండలంలో గత రెండేళ్ల నుంచి అధ్వానంగా ఉన్న రహదారులతో ప్రజలు, వాహదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దగ్గర నిధులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రోడ్డు పనులు చేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదని అన్నారు. ప్రతిసారి అధికారులు అంచనాల నివేదికలు సిద్ధం చేస్తున్నప్పటికీ రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డుకు అవసరమైన నిధులను అత్యవసర పరిస్థితుల కింద మంజూరు చేసి తక్షణమే రోడ్డుపై ఉన్న గోతులు కప్పి ప్రయాణికులు, ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.



గొయ్యిలో కూరుకుపోయిన లారీ వద్ద నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

గిరిజన అభ్యర్థులకు టెట్, డిఎస్‌సి శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు స్థానికంగా టెట్, డిఎస్‌సి శిక్షణ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం, విద్యార్థి సంఘం నాయకులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి విన్నవించారు. గుమ్మలక్ష్మీపురంలో ఆమె స్వగృహంలో మంగళవారం గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. టెట్, డిఎస్‌సి పోటీ పరీక్షలకు సంబంధించి స్థానికంగా శిక్షణ లేకపోవడంతో గిరిజన అభ్యర్థులు దూర ప్రాంతం వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లి టెట్, డిఎస్‌సి ఉచితంగా శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, డి. సురేష్, ఎ. చంద్రశేఖర్, పి. భగవాన్, ఇ.రామకష్ణ, ఆర్.లోవరాజు తదితరులు ఉన్నారు.

రెండోరోజు కొనసాగిన రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామానికి చెందిన దళితులపై దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ కేసు పెట్టి అరెస్టు చేయాలని, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదల భూముల సమస్యల పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట రెండో రోజు మంగళవారం కూడా రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. రిలే దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులకు సంఘీభావం ప్రకటిస్తూ ప్రజాసంఘాల నాయకులు రెడ్డి వేణు, బంకు సూరిబాబు, మచ్చ పకీరమ్మ, లక్ష్మి, పాలక కళావతి, కారు లక్ష్మి, పి.రాము, సీదర చిన్నయ్య, కొర్ర శివ, మెల్లికి రాము, తాడంగి ఉదయ్, తాడంగి బాదల్, అఖిల్ పాల్గొన్నారు. అనంతరం ఈ శిబిరాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము మాట్లాడుతూ దళితులపై దాడి జరిగి 20 రోజులవుతున్నా అధికారులు, పోలీసులు పెత్తందారులను అరెస్టు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. వారి భూమిని వారికి అప్పజెప్పి, జిల్లాలో భూములను ఆక్రమించిన వారిపైన, సాగు చేస్తున్న దళిత, గిరిజన, బీసీలు, పేదలకు పట్టాలి ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన ఉధృతి చేస్తామని తెలిపారు.



రిలే నిరాహారదీక్షల్లో పాల్గొన్న దళితులు



పాఠకులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌కుమార్

లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలి

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకొని యువత లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళ వారం స్థానిక చర్చి వీధిలో గల గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతీ యువకులతో మాట్లాడారు. ఎంత వరకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నవి, ఏపి పోటీ పరీక్షలకు ఏ విధంగా సాధన చేస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. గ్రూప్-1తో పాటు ఇతర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నామని విద్యార్థులు కలెక్టర్‌కు తెలపగా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు నిరంతర కఠోర సాధన, ఏకాగ్రతతో ఎంచుకున్న లక్ష్య సాధన దిశగా కృషిచేసి ఉత్తమ ఫలితాలను పొందాలని ఆకాంక్షించారు. ఆత్మన్యూనతను విడనాడి విషయ అన్వేషణను అలవారుచుకోవాలన్నారు తనవంతుగా గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ లైబ్రేరియన్ దుర్గా ప్రసాద్, యువత తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన చెట్టు

కూలిన భారీ వృక్షం... తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

భారీ మామిడి వృక్షం ప్రధాన రహదారిపై కూలి పెను ప్రమాదం తప్పిన సంఘటన మండలంలో పి.లేవిడి, గుమ్మ గ్రామాల ప్రధాన రహదారి మధ్య మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం వృక్షం కూలిన సమయంలో గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురానికి చెందిన పువ్వల రాంబాబు అటువైపు వెళ్తుండగా చివర కొమ్మలు తగిలి చిన్న చిన్న గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. అనంతరం భారీ ట్రాఫిక్ కావడంతో పోలీస్ సిబ్బంది స్పందించి ప్రధాన రహదారిపై పడినటు వంటి భారీ వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్ కష్టాలు తీర్చారు. ప్రయాణికులు పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

ఏడు తూనిక కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - సీతానగరం

చెరుకు రైతులకు అనువుగా బొబ్బిలి, సీతానగరం మండలాల్లో 7 కొత్త చెరుకు తూనిక కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు సంకిలి షుగర్ ఫ్యాక్టరీ జోనల్ మేనేజర్ ఎంవి మురళి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చెరకును అలజంగి, పినపెంకి, వాడాడ, కృష్ణరాయపురం, కామన్నదొరవలస, నిడగల్లు, నందగొలగలో చెరుకు తూనిక కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. 2024-25 సంవత్సరంలో సబ్సిడీని ఒకేసారి ఇచ్చేందుకు ప్రతిపాదన ఉన్నాయన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు మొక్క చెరుకు ఎకరాకు రూ.4వేలు, మమ్ము చెరుకు ఎకరాకు రూ.2వేలు చొప్పున సబ్సిడీ ఇస్తున్నామన్నారు. మొక్కు చెరుకు సాగుపై రైతులు మక్కువ చూపేందుకు యాజమాన్యం ప్రోత్సహిస్తుందని తెలిపారు. సమావేశంలో ఫీల్డ్ మెన్‌లు ఎల్లంనాయుడు, రమేష్ ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మంగళవారం ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.రాబర్ట్ పాల్ అకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు దుకాణాల్లో ఎరువులను, పురుగుల మందులు, వ్యవసాయ సంబంధిత వస్తువులను అధిక రేట్లకు అమ్మిన వారిపై చర్యలు తప్పవన్నారు. దుకాణాల్లో రికార్డులు నిర్వహించాలని, ప్రతి వస్తువు కొనుగోలుపై బిల్లులు చెల్లించాలని, ప్రతి బిల్లుపై రైతు సంతకం ఉండాలని ఆయన ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల దుకాణాల డీలర్లు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఇ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలిలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెదభోగిలికి చెందిన సురగాల సరోజనమ్మ ఇంట్లో ఫిబ్రవరి 24న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి నిద్రిస్తున్న ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్లు దొంగతనం చేసినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తుండగా మంగళవారం మండలంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న జొన్నాడ సుజాత, చెరుకుపూడి శేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ మేరకు సరోజనమ్మ ఇంట్లో ఎత్తుకెళ్లిపోయిన రెండున్నర తులాల చైన్లు వారి నుంచి రికవరీ చేసి, అనంతరం పార్వతీపురం కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు.

కలుపుతో పంట నాశనం : ఏడిఎ

ప్రజాశక్తి - వీరఘట్టం

భూమి చదును సరిగ్గా చేయకపోవడంతో కలుపు మొక్కలు పెరిగిపోయి పంటను ఎదగనీయకుండా నాశనం చేస్తుందని పాలకొండ డివిజన్ వ్యవసాయశాఖసహాయ సంచాలకులు కె.రత్నకుమారి అన్నారు. మంగళవారం ఆమె జియ్యమ్మ వలస మండలం పెద్ద బుడ్డిడికి చెందిన గురాన శ్రీరామ్మూర్తి మొక్కజొన్న పంటను పరిశీలించారు. వేసిన పంట ఏపుగా పెరగాలంటే చుట్టూ ఉన్న కలుపు మొక్కలు తొలగించాలన్నారు. అలాగే పంట భూమిని సరిగ్గా చదును చేయకపోవడం వల్ల వేసిన పంటను ఎదగనీయకుండా దాని భూసారాన్ని గ్రహిస్తుందన్నారు. ఏడిఎ వెంట స్థానిక స్థానిక వ్యవసాయ అధికారి జక్కువ సౌజన్య , రైతు, తదితరులు ఉన్నారు .



జొన్నపంటలోని కలుపును పరిశీలిస్తున్న ఏడిఎ రత్నకుమారి

ఘనంగా పారిశుధ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో పారిశుధ్య వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ స్థానిక వైకెఎం కాలనీలో పారిశుధ్య వారోత్సవాలను ప్రారంభించారు. చేతులు పరిశుభ్రంగా కడుగుకునే విధానాన్ని నిర్వహించారు. పారిశుధ్య పోస్టర్‌ను లాంఛనంగా విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పారిశుధ్యం పాటించాలన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ వారోత్సవాలు ఈ నెల16 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వారోత్సవాల్లో పంచాయతీరాజ్, వైద్యఆరోగ్యం, మునిసిపాలిటీ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కురుపాం : పరిసరాలు పరిశుభ్రతతోనే మనిషి ఆరోగ్యం ముడిపడి ఉంటుందని మండల ప్రత్యేక అధికారి, డిపిఒ బి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఎంపిడిఒ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన పారిశుధ్య పక్షోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి రావాడ జంక్షన్ వరకు భారీ ర్యాలీతో వెళ్లి మానవహారం నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పిటిసి జి.సుజాత, స్థానిక సర్పంచ్ జి.సుజాత, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, కలిశెట్టి కొండయ్య, నేరేడుబిల్లి వంశీ, ఎన్.ధూళికేశ్వరరావు, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, సిడిపిఒ కె.విజయగౌరి, వైద్యాధికారి ప్రజ్ఞ, పలువురు అధికారులు, అంగన్‌వాడీలు, సిఆర్‌పిలు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమరాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించారు. ఎంపిపి శెట్టి శ్యామల ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు, ఎఒ రమేష్, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్, ఎపిఎం వెంకటరమణ, ఎపిఒ బాలకృష్ణ, ఐసిడిఎస్ వివిధ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ దేవకుమార్ పారిశుధ్య వారోత్సవాలను ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ, ఎపిఎం సన్యాసిబాబు, ఎపిఒ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ ఆధ్వర్యాన ఎంపిడిఒ రమేష్‌నాయుడుతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో అధికారులు, విద్యార్థులు సీతంపేటలో ర్యాలీ చేసి స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ చినబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ప్రత్యేక అధికారి సింహాచలం, ఎంపిడిఒ గీతాంజలి, సర్పంచ్ కళావతి, సిడిపిఒ రంగ లక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకప్ దయానంద్, డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు, హెచ్‌ఎం పద్మశ్రీ, ఎఎంఒ కోటిబాబు, కార్యదర్శి సుదర్శన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బజారు గుండా మండల పరిషత్ కార్యాలయం వరకు పారిశుధ్య పక్షోత్సవాలు డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.శ్రీరాములునాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ సర్పంచ్ జె.తేరేజమ్మ, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, ఎంపిడిఒ జి.ఈశ్వరరావు, తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎపిఎం ఆర్.శ్రీరాములనాయుడు, ఎంఇఒ జి.సూర్యదేవుడు, ఎపిఒ బి.భాను, ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, వైద్యాధికారి పి.పావనితో తదిరులు పాల్గొన్నారు.

పాచిపెంట : పారిశుధ్య వారోత్సవాలను పాచిపెంటలో ఎంపిపి బి.ప్రమీల, సర్పంచ్ సంతోషిని ర్యాలీ నిర్వహించారు. అలాగే మిర్తివలసలో సర్పంచ్ కొత్తల సత్యవతి ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎస్ఒ శివప్రసాద్, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, తహశీల్దార్ పి.బాల, సిడిపిఒ అనంతలక్ష్మి, పి.నరసింగరావు, పల్లేడ ఉమా, ఎన్.మెహర్‌బాబా, ధనంజయ్, నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలం జమదాలలో మండల ప్రత్యేకాధికారి పంచాయతీరాజ్ శాయిఇ కృష్ణాజీ చేతుల మీదుగా పారిశుధ్య వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అకిబ్ జావేద్, ఇఒపిఆర్‌డి జి.రమణమూర్తి, సర్పంచ్ భారతి, స్థానిక నాయకులు గొట్టపు వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మక్కువలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, అంగన్‌వాడీలు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం : పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.గౌరీశంకరరావు, ఉపసర్పంచ్ కిషోర్ కుమార్, విఆర్ఒ హరికృష్ణ, గ్రంథాలయ అధికారి సుకన్య, రిటైర్డ్ హెచ్‌ఎం జి హరిప్రసాద్, మహిళలు, సాయి యూత్ సభ్యులు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, ఎంపిటిసి అనూరాధ, తొత్తడి నారాయణమ్మ, శ్యామ్, యుగంధర్ పాల్గొన్నారు.

వీరఘట్టం : ఎంపిడిఒ ఎంవివి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యమే మహాభాగ్యం, ప్రతి ఒక్కరికీ పారిశుధ్యంపై అవగాహన ఉండాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి సూపరింటెండెంట్ జనార్ధనరావు, శాంతకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : పట్టణంలో పారిశుధ్యంపై నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధా కుమారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ జయరాం, నాయకులు కడగల రమణ, మరైదాను, తుమ్మగుంట శంకరరావు, తదితరులు ఉన్నారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయంలో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అశోక్ ఎంపిడిఒ రామకృష్ణ, డిప్యూటీ డిఇఒ కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

భామిని: పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య నిర్వహణలో శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ ఆర్.కిషోర్ కుమార్ సూచించారు. గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు ఉన్నారు.

బకాయిలు చెల్లించే వరకూ విధులకు హాజరవ్వం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బకాయి పడ్డ వేతనాలను చెల్లించే వరకు తాము విధులకు హాజరవ్వమని మున్సిపాల్టీలోని చెత్త సేకరణ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న క్లాప్ డ్రైవర్లు తెలిపారు. ప్రజారోగ్య విభాగానికి సంబంధించి చెత్త సేకరణ వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న 11మంది క్లాప్ డ్రైవర్లు మంగళవారం చెత్త సేకరణ వాహనాలను తీయకుండా నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల బకాయి వేతనాలతో పాటు 8 నెలల పిఎఫ్‌లను సంబంధిత కాంట్రాక్టర్ చెల్లించడం లేదని, జీతాలు చెల్లించమని ఫోన్ల ద్వారా కాంట్రాక్టర్‌ను కోరితే తమను విధులకు రావొద్దని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ప్రతి నెలా సంబంధిత కాంట్రాక్టర్‌కు స్వచ్ఛ స్వచ్ఛ్‌ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా వేతనాలు వేస్తున్నామని, ఈ విషయంపై తాము ఏమీ చేయలేమని చెబుతున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాల్లో గల ప్రతి మున్సిపాలిటీలోని క్లాప్ డ్రైవర్ల వేతన బకాయిలు పెండింగులోలేవని, ఒక్క పార్వతీపురం మున్సిపాలిటీలో మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలగజేసుకొని సంబంధిత కాంట్రాక్టర్ తమకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బంకూరు సూరిబాబు ఆధ్వర్యంలో డిఆర్ఒ కేశవనాయుడుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్లు నక్క త్రినాథ, సీరేలా ప్రతాప్, బంగారి శంకర్రావు, మామిడి మధు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల నిరసన



డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న క్లాప్ డ్రైవర్లు, సిఐటియు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే కోలక లక్ష్మణరావు

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి ఏటా ఆగస్టు 9న నిర్వహించే ఆదివాసీ దినోత్సవ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని గిరిజన సంఘాల నాయకులు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వైటిసిలో అన్ని గిరిజన సంఘాల నాయకులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఆదివాసీ ఉత్సవాల పండగ ఒక వేదిక కావాలన్నారు. ఇప్పటికే ఆదివాసీలకున్న హక్కులు, చట్టాలు నిర్వీర్యమవుతున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి గిరిజనుడిపై ఉందన్నారు. ఆదివాసీల జీవన విధానం, కళలు ప్రతిభంభించేలా ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, మండంగి రమణ, ఆదివాసీ నాయకులు మండంగి భూషణ, కద్రక మల్లేశ్వరరావు, అడ్డాకుల నరేష్, బిడ్డిక కొండలరావు, కద్రక కళావతి, వెంపటాపు భారతి, బిడ్డిక పద్మావతి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, మండల కార్యదర్శి పత్తిక శంకర్రావు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబుల్ రైట్ ఫోరం అధ్యక్షులు రోబ్బ లోవ రాజు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో జవాను మృతి

ప్రజాశక్తి -మక్కువ

స్వల్ప అస్వస్థతకు గురైన ఆర్మీ జవాను తేలు దినేష్ (34) మృతి చెందాడు. దినేష్ ఈ నెల 12న తన స్వగ్రామమైన కన్నంపేట వచ్చారు. ఇటీవల స్వల్ప అస్వస్థత గురికావడంతో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.

జిపిఎస్ జిఒను శాశ్వతంగా రద్దు చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన గ్యారెంటెడ్ పెన్షన్స్ స్కీం (జిపిఎస్) గెజిట్‌ను తాత్కాలికంగా నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడం పట్ల ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రినాధరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ముఖ్యమంత్రి కూడా ఈ జీవో పట్ల ఆరా తీశారని, ఇప్పుడు ఎందుకు బైట పెట్టారో విచారించాలని కూడా అధికారులకు ఆదేశించారని తెలిపారు. ఈ జీవోను బయటపెట్టిన అధికారులపై చర్యలు తీసుకుని తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వతంగా ఈ జీవోని రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు.

జిపిఎస్ గెజిట్ నిలిపివేత పట్ల హర్షం

పార్వతీపురం రూరల్ : జిపిఎస్ గెజిట్ను అమలు కాకుండా నిలిపివేసిన సిఎం చంద్రబాబు నాయుడుకు మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అభినందనలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తానని ప్రకటించి ఉద్యోగులను, ఉపాధ్యాయులను మోసగించడమే కాకుండా తన తన పదవీకాలం పూర్తయినా జిత్తుల మారి బుద్ధితో ఆర్థిక శాఖ కమిషనర్‌తో జిపిఎస్ గెజిటెడ్ నోటిఫికేషన్‌పై సంతకం చేయించి మాజీ ముఖ్యమంత్రి తన బుద్ధిని చాటుకున్నారని విమర్శించారు.



జంపరకోట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గిరిశిఖర గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ పంచాయతీలో గల గెడ్డగూడ, జంపర్ కోట, కొత్తగూడ తదితర గిరిశిఖర గ్రామాల్లో నాలుగు ఏనుగుల గుంపు మంగళవారం సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఆ గ్రామాల గిరిజనులు మాట్లాడుతూ తాము సాగు చేసుకున్న అటవీ ఫలసాయాలను, సామలు, సోలు, పసుపు తదితర పంటలను ఏనుగులు గుంపు నాశనం చేస్తుందని, ఇంటి నుంచి బయటికి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ రావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు కనీసం పంట నష్టపరిహారం కూడా ఇవ్వలేదని, ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగులు గుంపును తమ నివాస ప్రాంతానికి దూరంగా తరలించి మా ప్రాణాలను, పంటలను రక్షించాలని కోరారు.

ఎమ్‌పికి సమస్యలు విన్నవించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు ఎమ్మెల్యే బేబినాయన వివరించారు. బొబ్బిలి రైల్వే స్టేషన్లో వ్యాగన్ లోడింగ్, అన్ లోడింగ్ కేంద్రాన్ని కొనసాగించాలని, సువర్ణముఖి నది నుంచి బొబ్బిలి పట్టణానికి ప్రత్యేక పైపులైన్ పనులకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. డొంకినవలస రైల్వే స్టేషన్ సమీపంలో చెరువులకు నీరు వెళ్లకుండా రైల్వే మూడో లైన్ కాంట్రాక్టర్ మట్టి వేశారని, చెరువులకు నీరు వెళ్లేలా చూడాలని కోరారు. ఎంపీగా ఎన్నికైన మొదటిసారి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బొబ్బిలి రావడంతో ఎమ్మెల్యే బేబినాయన, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికుడ్ని పరామర్శిస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికుడికి పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

పెదమేరంగి మేజర్ పంచాయతీ సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ ఇంటి పని చేస్తూ భవన కార్మికులు ఒమ్మి చిన్న, శానపతి కృష్ణ పరంజిపై నుంచి పడిపోయారు. ఈ ప్రమాదంలో చిన్న కాలు విరిగిపోయింది. ఈ విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మికసంఘం నాయకులు ఆర్.రాము, టి.రమేష్ మంగళవారం చిన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవన కార్మికులు తరచుగా ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమానికి బోర్డు ఉన్నా అది నిరుపయోగంగా ఉందని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను ఇతర పథకాలకు దారి మళ్లించడంతో కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కొత్త ప్రభుత్వం తక్షణమే కార్మికుల సంక్షేమానికి పటిష్టమైన సమగ్రమైన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో ఆర్.శంకర్రావు, కుప్పిలి అప్పారావు, టుంపిల్లి వెంకటరమణ పరామర్శించారు.

కొనసాగుతున్న స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన పల్లంకి, పల్లంకివలస, మీనకోట తదితర గ్రామాల్లో రెండో రోజు దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ ఆధ్వర్యంలో మలాథియన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. అనంతరం ప్రజలకు సీజనల్ జ్వరాలు, పరిసరాల పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామాల్లో జ్వరాలు ఏ విధంగా ఉన్నాయో ఆరా తీశారు. జ్వరాలుంటే వెంటనే తెలియజేయాలని గిరిజనులకు సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జె.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కేదారిపురం పంచాయతీ సెంటర్‌గూడలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్ ఆధ్వర్యంలో ఎసిఎం పిచికారీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వ్యాధులు రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



పల్లంకిలో దగ్గరుండి స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్యాధికారి భాను ప్రతాప్

నారాయణ రావు మృతి పట్ల సంతాపం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టిడిపి నేత, ఎంపిటిసి సభ్యులు కరణం నారాయణరావు మంగళవారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి మాజీ ఇన్-ఛార్జ్ నిమ్మక పాండురంగ, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, చెబోదుల లక్ష్మీనారాయణ, కోట సంగంనాయుడు, రాయి రామకృష్ణ, లంక మహేంద్ర, తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించారు.

నవధాన్యాల సాగు నేల తల్లికి బాగు

ప్రజాశక్తి - కురుపాం

రైతులు నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల ఆర్థిక లాభాలు పొందడంతో పాటు నేలతల్లికి బహుబాగుగా ఉంటూ సారవంతంగా తయారవుతుందని రీజనల్ టెక్నికల్ అధికారి జి .హేమసుందర్ అన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న దురిబిలి గిరిజన గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలను 40 రోజుల్లోపు భూమిలో కలియదున్నడం వల్ల పంటకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని, దానివల్ల రైతుకు పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. శ్రీరాగి, శ్రీవరి పద్ధతిలో పంటలు వేసుకోవడం వల్ల ఎక్కువ దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.అప్పలనాయుడు, రైతులు వి.సత్తి, చిన్నారావు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



దురిబిలిలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న హేమసుందర్